# అమరావతి కథలు

సత్యం శంకరమంచి

'నాయుడి పాలన నాణ్యమైన పాలన .' అని జనమంతా అనుకున్నా వేంకటాద్రినాయుడికి మనశ్శాంతి లేదు.

రాత్రి కలత నిద్రతో కళ్ళు కనకన లాడుతుండగా వొంటరిగా అంతఃపురంలో కూర్చున్నాడు నాయుడు. సరిగంచు పంచెలూ మార్చలేదు. జరీ వల్లెవాటూ వేయలేదు. తలెత్తి చూస్తే ఎన్నడూ లేంది అంత ఉదయానే పాపయారాధ్యులవారు విచ్చేస్తున్నారు.

"ఇంత పొద్దుటే దర్శనమిచ్చారు" అన్నాడు నాయుడు అభివాదం చేస్తూ.

"ప్రభువులవారి స్వస్థత తెలుసుకుందామని" అన్నాడు పాపయారాధ్యులు.

నాయుడు నిట్టూర్చినట్టు నవ్వి ఆరాధ్యుల కళ్ళలోకి చూశాడు. ఎదురుగా పరమ శివావతారంలా మహేశ్వర మూర్తి. పాపయారాధ్యులు నవ్వాడు. ఆ నవ్వు ఉపశమనంగా తోచింది నాయుడికి.

ఇంతలో మందీ మార్బలం హుటాహుటిన వచ్చారు. 'ప్రభూ! దేవాలయ నిర్మాణంలో శాసనం దొరికింది. ఆ శాసనం ప్రకారం కృష్ణ దేవరాయల వారు కొండవీడు జయించి అమరేశ్వరుణ్ణి దర్శించి స్వర్ణ తులాభారం తూగారట' అన్నారొకరు.

నాయుడి శరీరంలో రాజసం పొంగింది. తెలియకుండా చేయి మీసం మీదకు పోయింది.

'అలనాడు రాయలవారు గొప్ప ప్రభువు... అన్నాడు నాయుడు ఠీవిగా, మిగతా వాక్యం మిగిలినవారు పూరించారు. 'ఈ కాలాన తమరు గొప్ప ప్రభువులు...'

అంతఃపురంలో జయ జయ ధ్వానాలు మోగినట్టయింది. నాయుడి ముఖమంతా సంతోషం అలుముకుంది. మిగిలినవారు మళ్ళీ అన్నారు. 'కవి పోషణలోనేమి, శౌర్య పరాక్రమాల్లోనేమి తమరు రాయలవారికి దీటైన వారు. ప్రభువులవారు కూడా స్వర్ణ తులాభారం తూగితే...'

నాయుడికి కళ్ళు గర్వంగా వెలిగాయి. అంగీకారంగా చేయెత్తడంతో క్షణాల మీద లెక్కలుకట్టి తులాభారానికి ముహూర్తం నిర్ణయించారు. ఈ శుభ వార్త పట్టణంలో తెలియచేయడానికి పరుగు పరుగున వెళ్ళిపోయారు.

పాపయారాధ్యులూ, నాయుడూ ఇద్దరే మిగిలారు. అప్పటిదాకా మౌనంగా వున్న ఆరాధ్యుల్ని మాట్లాడించడానికేమో అన్నట్టు నాయుడు అన్నాడు "ఖజానాలో కనకరాసులూ, రత్న మాణిక్యాలూ వున్నాయికదా! అందరికి ఇద్దాం" అని.

"మరి సంపాదించటమెందుకో?" అన్నాడు పాపయారాధ్యులు.

"పంచడానికే" అన్నాడు నాయుడు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

స్వర్ణ తులాభారం మహావైభవంగా జరిగింది. వూరూ వాడా అంతా దేవాలయంలో వుంది. జనం కిక్కిరిసిపోయారు. తన ఎత్తు బంగారం తూచి పేదలకు పంచి పెడ్తుంటే దయా సముద్రం పొంగి పొర్లినట్లుంది. ఆ తరువాత ఎవరి నోటంట విన్నా ఆ ఉత్సవ విశేషాలే. నీలాటి రేవులో, పసిపిల్లల ఆటలో, పొలం కోతల్లో అందరూ ఇదే వూసు చెప్పుకునేవారు. అలా కొన్ని నెలలు గడిచాయి.

కాలం వెళ్ళి పోయినా నాయుడి మనస్సులో అశాంతి వెళ్ళి పోలేదు. మళ్ళీ ఏదైనా దానం చేయాలని అనుకున్నాడు. స్వర్ణ గోవును తయారు చేయించి ఆ గోగర్భం లోంచి ఈవలకి వచ్చి ఆ బంగారాన్ని బ్రాహ్మణులకు దానం చేస్తే శాంతి కలుగుతుందని ఒకరు చెప్పారు.

ఆ ప్రకారమే ఉత్సవం ఏర్పాటైంది. దేశం నాలుగు చెరగుల్నించి జనం వచ్చి పడ్డారు. నాయుడు సుస్నాతుడై గోగర్భం ప్రవేశించి ఈవలకి వచ్చాడు. ఆ బంగారాన్ని ముక్కలు చేసి బ్రాహ్మణులకు దానమివ్వబోతుండగా పంచములు అడ్డువచ్చి అన్నారు. "అయ్యా! అది వచ్చి




పోయిన ఆవు మాకు చెందాలి" అని.

అందరూ తెల్లబోయారు.

వాళ్ళు మళ్ళీ మళ్ళీ అందుకుని "ఈ బంగారం గనుక బ్రాహ్మలకి పంచి పెడ్తే రేపటి నుంచి వూళ్ళో వచ్చిపోయిన పశువులన్నింటినీ వాళ్ళు చూసుకోవలసిందే మాకు సంబంధం లేదు" అన్నారు.

చమత్కారానికి నాయుడు నవ్వుకుని ఆ బంగారం విలువ పంచములకు పంచి పెట్టాడు. ఆ ఉత్సవాన్ని గురించి ఆర్నెల్లు చెప్పుకున్నారు జనం.

ప్రజలు ఎంత పొగిడినా, ఎంత చెప్పుకున్నా నాయుడుకి మనశ్శాంతి చిక్కలేదు. రాత్రిళ్ళు రెప్ప వాలడం లేదు. ఓ అర్థరాత్రి ఉన్నట్టుండి లేచిపోయాడు. నిర్మానుష్యంగా వున్న అంతఃపురాన్ని దాటాడు. కోట గుమ్మంలో నుంచుంటే ఊరంతా నిద్రపోతోంది. చీకట్లో లోకమంతా హాయిగా విశ్రాంతి తీసుకుంటోంది. కాని తనకు శాంతి లేదు. గిలగిల్లాడి పోయాడు నాయుడు.

ఎదురుగా పాపయారాధ్యులు.

ఒకళ్ళ నొకళ్ళు చూసుకున్నారు. తనతో రమ్మన్నాడు పాపయారాధ్యుడు. పసిపిల్లవాడిలా పాదరక్షలు కూడా లేకుండా నడిచి వచ్చాడు నాయుడు. దోవలో రాళ్ళు,రప్పలు కోసుకుపోతున్నాయి. దేవాలయం మొదటి ప్రాకారంలోకి వచ్చారు ఇద్దరూ. పాపయారాధ్యులు మారేడు చెట్లన్నిటినీ తాకుతూ ప్రదక్షిణం చేస్తున్నాడు. నాయుడు మారేడు చెట్లని తాకుతూ ముందుకు నడుస్తున్నాడు. ఆ స్పర్శ, ఆ గాలి, ఆ చీకటి విచిత్రంగా వుంది నాయుడికి. గుండెలో ఏవో కదిలిపోతున్నాయి. గన్నేరు చెట్లు పలకరిస్తున్నాయి. జమ్మి కొమ్మలు వింజామరలు వీస్తున్నాయి. పై ప్రాకారంలోకి వచ్చారిద్దరూ, నాయుడిని ఒక చోట నుంచో పెట్టారు పాపయారాధ్యులు, ఎదురుగా వేలు చూపించారు. ఎదురుగా మూసివున్న తలుపు ఆ పైన నంది, ఆ నంది మీదుగా చూస్తే అమరేశ్వరుడు. తలుపులు మూసి వున్నా స్వామి కన్పిస్తున్నాడు నాయుడుకి. పాపయారాధ్యులు నాయుడు చెవిలో పంచాక్షరి వూదాడు. ఆ పంచాక్షరిని స్మరిస్తూ అంజలి ఘటించి నుంచున్నాడు నాయుడు. నాయుడి గుండె తేలికవుతోంది. కరిగిపోతోంది. స్వామి అడుగుతున్నట్లనిపించింది. ఎందుకయ్యా ఈ దానాలు? నేను నీకిచ్చింది నువ్వు అందరికీ పంచి గొప్పవాడిననుకుంటున్నావు. నువ్వు నాకేమిస్తున్నావయ్యా?"

నాయుడు కన్నీళ్ళయిపోతున్నాడు. అది నిద్రం మెలకువ అంతకన్నా గాదు. మనసులో వల్లగా వుంది.

తెలతెలవారుతుండగా పరివారం ప్రభువుని వెతుక్కుంటూ వచ్చిన ధ్వనికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు నాయుడు. ఎదురుగా అనుష్ఠానం ముగించిన పాపయారాధ్యులు నవ్వాడు; అదేచోట... అదే చోట తాను అంజలి ఘటించి ప్రార్థిస్తున్నట్టు తన విగ్రహం చెక్కించమన్నాడు నాయుడు. ●

# ముత్యాలవాన